క్లుప్తంగా

కాగితపు బొమ్మల తయారీలో శిక్షణ



తయారు చేసిన బొమ్మలతో చిన్నారులు

గాజువాక: వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా గాజువాక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కాగితపు బొమ్మల తయారీ నేర్పించారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ ఆధ్వర్యంలో చిన్నారులకు వివిధ బొమ్మలను తయారు చేయడం నేర్పించడంతో పాటు కథలు చెప్పడం, రాయడంలో శిక్షణనిచ్చారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్టు గ్రంథాలయాధికారి తెలిపారు. ఈ నెల 7న వేసవి శిబిరం ముగుస్తుందని, వివిధ అంశాలలో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు ఆరోజు బహుమతులను అందజేస్తామని పేర్కొన్నారు.

ఆదిత్య కళాశాలలో కొత్త స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు

గాజువాక: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో నూతన స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను ప్రవేశ పెడుతున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్‌లో భాగంగా ఈ కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు. అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ కింద బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీస్, ఇన్సూరెన్స్, లాజిస్టిక్స్, రిటైల్ మేనేజ్‌మెంట్ కోర్సులలో శిక్షణనిస్తామన్నారు. ఈ కోర్సులలో చేరే విద్యార్థులకు మొదటి రెండేళ్లలో శిక్షణ ఉంటుందని, ఆఖరి సంవత్సరంలో ఏదో ఒక పరిశ్రమకు పంపించి అక్కడ అప్రెంటిస్‌షిప్ చేసే వీలును కల్పిస్తామన్నారు. ఆ సమయంలో విద్యార్థులకు ప్రతినెలా రూ.7,000 నుంచి రూ.15 వేల వరకు స్టైపెండ్ ఉంటుందన్నారు. అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు.

కార్యకర్తల సమావేశం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దామా సుబ్బారావు

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో పార్టీ వార్డు అధ్యక్షుడు, విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు తన నివాసంలో బుధవారం సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. సమావేశంలో పార్టీ వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురామ్, జిల్లా కార్యదర్శి చేగొండి శ్రీనివాసరావు, సోషల్ మీడియ కన్వీనర్ శ్రీనివాస్ పట్నాయక్, వార్డు మహిళా అధ్యక్షురాలు నిర్మల, నాయకులు చిట్టి దేముడు, మాటూరి శ్రీనివాసరావు, భూపతి రాజు శ్రీనివాసరాజు, లక్ష్మణ్, సన్యాసిరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న పూర్ణ

అగనంపూడి: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి అగనంపూడికి చెందిన జి.పూర్ణానందశర్మ (పూర్ణ) రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ తాను కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు పత్రంలో పేర్కొన్నారు. కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌కు రాజీనామా పత్రాన్ని పంపినట్టు ఆయన తెలిపారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

- వాడవాడలా అవగాహన ర్యాలీలు
- ఘనంగా పర్యావరణ దినోత్సవం



75వ వార్డులో మొక్కలు నాటుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత



అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ వద్ద మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పెదగంట్యాడ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 75వ వార్డులోని నెల్లిముక్కు, బాలచెరువు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఆమె మొక్కలు నాటారు. అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, వేణుశ్రీ, వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కాలుష్యాన్ని అరికట్టేందుకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. మానవాళి మనుగడకు మొక్కలు దోహదం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన బీచ్‌లే లక్ష్యం

తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ సభ్యుడు మీసాల శివనాగేశ్వరరావు తెలిపారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని యారాడ తీర ప్రాంతంలో బుధవారం చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం సామూహిక ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్‌ను నిషేధించాలని, కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో సతీష్, రేవతి, దేవి, సత్యవతి, మోహన్, మణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎం.ఎల్.ఎస్.కాంతం అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హైస్కూల్ వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. కాలుష్యానికి కారణమైన ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. అనంతరం పర్యావరణాన్ని పరిరక్షించాలని, మొక్కలు నాటాలని నినాదాలు చేస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం కుమారస్వామి, రవిచంద్, ఇస్మాయిల్, ప్రసాద్, భాస్కరరావు, సావిత్రి దేవి, వేణు, మాధురి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దువ్వాడ వీఎస్ఈజెడ్‌లో..

అగనంపూడి: పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకున్నప్పుడే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని దువ్వాడ వీఎస్ఈజెడ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాళ శ్రీనివాసరావు అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దువ్వాడ వీఎస్ఈజెడ్ ప్రధాన పరిపాలనా భవనం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణతోనే మనిషి జీవనం ముడిపడి ఉందనే విషయం ప్రతీ ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రకృతిని కాపాడుకుంటే అది మనల్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిని అపరంజి కొరాతి, ఐఆర్ఎస్ వరప్రసాద్ వర్మ, వివిధ యూనిట్ల యాజమాన్యాలు, ఎస్ఈజెడ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



యారాడ బీచ్‌లో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు

లంకెలపాలెంలో..

79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు ప్రతీ పుట్టిన రోజు నాడు మొక్కలు నాటాలని హెచ్ఎం నాగేశ్వరరావు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, శ్రీను, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి ఎర్రమట్టి దిబ్బల్లో...

అగనంపూడి ఎర్రమట్టి దిబ్బల్లోని ఉక్కు నర్సరీ వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో అగనంపూడి లయన్స్‌క్లబ్ కార్యదర్శి ఎం.జగదీష్, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ బి.వి.సుబ్బారావు, పట్టా పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

పాత అగనంపూడికి చెందిన మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు స్టీల్‌ప్లాంట్ ప్రాధాన్యం



పర్యావరణ పరిరక్షణ ప్రారంభ వేడుకల్లో పాల్గొన్న సీఎండీ, డైరెక్టర్లు

ఉక్కునగరం: పర్యావరణ పరిరక్షణ స్టీల్‌ప్లాంట్ వ్యాపార ప్రక్రియల్లో ఒక అంతర్భాగమని సీఎండీ అతుల్ భట్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉక్కు ఎంపీ హాల్లో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భవిష్యత్తు తరాల కోసం భూగోళాన్ని కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. స్టీల్‌ప్లాంట్ అత్యాధునిక క్లీన్ అండ్ గ్రీన్ టెక్నాలజీలను అమలు చేయడం ద్వారా ఉత్తమ పర్యావరణ వ్యవస్థలతో పర్యావరణానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. తద్వారా దేశంలో ఐఎస్‌వో 14001 సర్టిఫికేషన్ పొందిన మొదటి ఉక్కు కర్మాగారంగా స్టీల్‌ప్లాంట్ నిలిచిందన్నారు. మట్టి కోత నిరోధించడానికి, నీటిని సంరక్షించడానికి స్టీల్‌ప్లాంట్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పాటిస్తున్నామన్నారు. ఉత్పత్తికి తగ్గట్టుగా ప్రారంభం నుంచి సుమారు 5.5 మిలియన్ చెట్లు నాటామన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు గ్రీన్ అవార్డులు, పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు స్టీల్‌ప్లాంట్ తీసుకుంటున్న చర్యలను ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (ఏపీపీసీబీ) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ కె.రమేష్ అభినందించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు ఎ.కె.బాగ్చీ, ఎస్.సి.పాండే, జి.వి.ఎన్.ప్రసాద్, సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ ఎ.ఎం.హనీఫ్, ఏపీపీసీబీ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ముకుందరావు, వివిధ విభాగాధిపతులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



దువ్వాడ వీఎస్ఈజెడ్ పరిపాలన భవనం వద్ద మొక్క నాటుతున్న డీసీ శ్రీనివాసరావు



లంకెలపాలెం హైస్కూల్లో మొక్క నాటుతున్న హెచ్ఎం నాగేశ్వరరావు, సిబ్బంది



అగనంపూడి ఎర్రమట్టి దిబ్బల వద్ద మొక్క నాటుతున్న లయన్స్ క్లబ్ కార్యదర్శి జగదీష్



మొక్కలు పంపిణీ చేస్తున్న మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు రామారావు

2030 నాటికి 100 మిలియన్ల మొక్కలు నాటడమే లక్ష్యం



వేడుకల్లో పాల్గొన్న గంగవరం పోర్టు ప్రతినిధులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో 2030 నాటికి 100 మిలియన్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పోర్టు ప్రతినిధులు తెలిపారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి పునరుద్ధరణ, కరువును తట్టుకోవడం అనే అంశాలపై గత నెల 30 నుంచి ఈ నెల 5 వరకూ వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బీచ్ ఫ్రంట్ క్లీనింగ్‌లో భాగంగా వలంటీర్ల సహకారంతో గంగవరం బీచ్‌ను శుభ్రం చేశారు. అక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఏరివేశారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం గంగవరం పోర్టు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటాం



దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట, పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఊపిరి ఉన్నంత వరకు కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు ఎం.రామారావు, డీసీ హెచ్.వెంకటేశ్వర్లు అన్నారు. కార్మికుల జీవితాలతో ఆడుకోవాలనుకుంటే కార్మికులతో పాటు రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల సారథ్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో భాగంగా 1210వ రోజు, బుధవారం శిబిరంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి దేశ ప్రజలు గుణపాఠం నేర్పారన్నారు. ఆరోగ్యకరంగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయాలనుకుంటే ఎవరికైనా ఇదే గతి పడుతుందన్నారు. కార్యక్రమంలో డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అరుదైన వృక్ష జాతుల నిలయం

- జీవ వైవిధ్య ఉద్యానవనంలో పుష్పాలు కనువిందు
- పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన విద్యార్థులు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, నగరవాసులు

ఏయూ క్యాంపస్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని స్థానిక జీవ వైవిధ్య ఉద్యానవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. జీవ వైవిధ్య ఉద్యానవనాన్ని సరిగ్గా 22 సంవత్సరాల క్రితం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున ప్రారంభించామని నిర్వాహకుడు డాక్టర్ మంథా రామమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా డాల్ఫిన్ నేచర్స్ కన్జర్వేషన్ క్లబ్, యూనిటీ డిగ్రీ కళాశాల, సెయింట్ జోసఫ్ కాలేజ్ ఫర్ విమెన్ సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాయి. 100 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఔషధ మొక్కలను ఉద్యానవనం ప్రాంగణంలో నాటారు. మూడెకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ ఉద్యానవనంలో మూడు వేలకు పైగా మొక్కలు పెంచుతున్నారు. నేల మీద, నీటిలో, చెట్లపైన జీవించే మొక్కలు ఇక్కడ కనువిందు చేస్తున్నాయి. ఎడారిలో మాత్రమే పెరిగే ముళ్ల మొక్కలు సైతం వందలాదిగా ఇక్కడ మనంకు దర్శనమిస్తాయి.



ముళ్ల మొక్కపై పుష్పాల కనువిందు

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

గాజువాక: కర్ణవానిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని స్వతంత్రనగర్ ఫీడర్, తుంగ్లాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని తుంగ్లాం ఫీడర్లలో ఈ నెల 7న నిర్వహణ పనులు చేపడుతున్నందున సంబంధిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా కృష్ణదేవరాయనగర్, పాతకర్ణవానిపాలెం, స్వతంత్రనగర్, వై జంక్షన్, పోర్టు రోడ్, సర్దార్ నెస్ట్ ఏరియా, తుంగ్లాం, చుక్కవానిపాలెం ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

జిల్లా స్థాయి కథలు, కవితల పోటీలు

గడువు ఈ నెల 15

అగనంపూడి: అగనంపూడికి చెందిన కంచిపాటి గురుమూర్తి మూడో వర్ధంతి సందర్భంగా కథలు, కవితల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు ఆయన కుమారుడు, యువ రచయిత కంచిపాటి వెంకట్ తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేవారు తమ రచనలను ఈ నెల 15వ తేదీలోగా 94908 05404 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని లేదా venkat1676@gmail.comకు మెయిల్ చేయాలని కోరారు. కథలకు సంబంధించి రచయితలు ఇష్టమైన అంశాన్ని తీసుకోవచ్చని, 8 వందల పదాలకు తగ్గకుండా, 12వందల పదాలకు మించకుండా ఉండేలా చూడాలని తెలియజేశారు. వీలైనంత వరకు తెలుగు భాషను మాత్రమే వాడాలని సూచించారు. కవితల పోటీలకు సంబంధించి సామాజిక అంశాల్లో ఏదైనా ఒక అంశాన్ని తీసుకొని 15 పాదాలకు తగ్గకుండా 25 పాదాలకు మించకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. కథలు, కవితల పోటీల్లో మొదటి ముగ్గురు విజేతలకు నగదు బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులు అందిస్తామన్నారు. రచయితలు తమ రచనలు పంపించేటప్పుడు ఆ పేపరుపై వారి పేరు రాయకూడదని తెలిపారు. దానికి వేరే ధ్రువపత్రం ఇవ్వాల్సి ఉంటుందని, అందులో మాత్రమే రచయిత పేరు, చిరునామా రాయాలని స్పష్టం చేశారు. విజేతలకు ఈ నెల 22న గురుమూర్తి వర్ధంతి సందర్భంగా అగనంపూడి సీడబ్ల్యూసీలో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని వివరించారు.

వసతి గృహానికి ఆధునిక హంగులు



ఆధునికీకరించిన మరుగుదొడ్ల బ్లాక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, తదితరులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని ఎస్సీ సంక్షేమ బాలురు వసతి గృహానికి ఆధునిక హంగులు సమకూర్చారు. రూ.38 లక్షల సీఎస్సార్ నిధులతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పనులు జరిగాయి. 100 మంది విద్యార్థులు ఈ వసతి గృహంలో ఉండటంతో అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించారు. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టర్ మల్లికార్జున ఆయా పనులు జరిగిన తీరును పరిశీలించారు. వసతిగృహానికి పూర్తిస్థాయి మరమ్మతులతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం, పెయింటింగ్ పనులు చేపట్టారు. ఆయా పనులను కలెక్టర్ పరిశీలించి, విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల్లో విత్తన బంతులు

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా సహజసిద్ధ అడవులు పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. సంఘ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం సభ్యులు విత్తన బంతులను మురళీనగర్ పరిసరాల్లోని కొండ ప్రాంతాల్లో విసిరి, కొన్ని చోట్ల రహదారులను ఆనుకుని ఉన్న ఖాళీ ప్రదేశాల్లో చింత, రాగి, జామ, మర్రి, సపోటా, దానిమ్మ విత్తనాలను నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డి.వరప్రసాద్, ఎస్.సీతారామకృష్ణ, ఉప కార్యదర్శి పి.సంతోష్‌కుమార్, నిర్వహణ కార్యదర్శి బి.వెంకటేశ్వరావు, కోశాధికారి కె.వి.వర్మ పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్ల పరిశీలన



పుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు

పెందుర్తి: రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వం నుంచి విద్యార్థులకు అందించనున్న విద్యా కానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను జిల్లా ఉన్నతాధికారులు బుధవారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పంపిణీకి సిద్ధంగా ఉన్న కిట్లను పరిశీలించి విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు వాటిని పూర్తిస్థాయిలో అందించాలని సూచించారు. ఆర్జేడీ విజయ్‌భాస్కర్, డీఈవో చంద్రకళ, సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అదనపు కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.